సాక్షి వనపర్తి

బుధవారం : 16 : ఆగస్టు : 2023



జూరాలకు స్వల్ప ప్రవాహం

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి స్వల్పంగా వరద కొనసాగుతుంది.

వివరాలు 10లో ▸



విశ్వశాంతి యాగ మహోత్సవం

జడ్చర్లలో మంగళవారం విశ్వశాంతి యాగ మహోత్సవం నిర్వహించారు.

వివరాలు 10లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 33.7 /23.7

రోజంతా ఎండ తీవ్రత కాస్త ఉంటుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రేవంత్‌రెడ్డిపై కేసు నమోదు

వనపర్తి: మల్కాజిగిరి ఎంపీ, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మహబూబ్‌నగర్ పోలీసులపై చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ జిల్లా పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ తరుపున ఎస్పీ సీసీ రాంచందర్ మంగళవారం జిల్లాకేంద్రంలోని పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్‌ఐ యుగంధర్‌రెడ్డి కేసునమోదు చేసినట్లు వెల్లడించారు. ఓ ప్రజాప్రతినిధి ప్రభుత్వ ఉద్యోగులను కించపరుస్తూ దుర్భాషలాడటం.. సోషల్ మీడియాలో ఆ వ్యాఖ్యలు వైరల్ కావడాన్ని జిల్లా పోలీస్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు ఖండించారు.

వేతన సవరణ చేయాలి

వనపర్తిటౌన్: 2017, 2021 సంవత్సరంలో వేతన సవరణ జరగక టీఎస్‌ఆర్టీసీ కార్మికులు తీవ్ర నిరాశలో ఉన్నారని ఎస్‌డబ్ల్యూఎఫ్ అధ్యక్షుడు వీరాంజనేయులు, ప్రధానకార్యదర్శి వీఎస్.రావు అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ రెండు సంవత్సరాల వేతన సవరణ జరగకుంటే ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతాలు రావని నిరాశ వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు పీఆర్సీ ప్రకటిస్తామని, అప్పటి వరకు ఐఆర్ ఇస్తామనడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీపై కేసు నమోదు



వనపర్తి: జిల్లాలోని మదనాపురం మండలం దుప్పల్లిలో ఆర్‌ఎంపీ రామన్నగౌడ్ ఎలాంటి అనుమతి లేకుండా మందులు నిల్వ చేసినందుకుగాను డ్రగ్స్ కాస్మొటిక్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసినట్లు జిల్లా ఔషధ తనిఖీ అధికారి ఏ.రష్మి తెలిపారు. మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేయగా పలురకాల మందులు, ఫిజీషియన్ శాంపిల్స్ లభ్యం కావడంతో సీజ్ చేసినట్లు వివరించారు. లైసెన్స్ లేకుండా మందులు నిల్వ చేయడం, విక్రయించడం నేరమని.. అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

నైట్ విజిల్ జనజాగరణ



పెబ్బేరు రూరల్: జిల్లాకేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో సోమవారం రాత్రి 9 నుంచి అర్ధరాత్రి ఒంటిగంట నైట్ విజిల్ జన జాగరణ కార్యక్రమం కొనసాగింది. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మేకల ఆంజనేయులు అధ్యక్షతన ఈ కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులు పాల్గొని మాట్లాడారు. క్విట్ఇండియా ఉద్యమస్ఫూర్తితో దేశాన్ని కాపాడుకుందామని, కేంద్ర ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దామన్నారు. అలాగే కేంద్రం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన ఐదు కనీస వేతనాల జీఓలను అమలు చేయాలన్నారు. రైతులకు కనీస మద్దతు ధర ప్రకటించాలని, మోటారు వెహికిల్ యాక్ట్ 2019, ఎలక్ట్రిసిటి బిల్లు 2022 రద్దు చేయాలని, ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేయరాదని, నేషనల్ మానిటైజేషన్ పైపులైన్ రద్దు చేయాలని కోరారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనాలు చెల్లించి, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కురుమయ్య, నందిమళ్ల రాములు, చంద్రయ్య, గద్దం కుర్మయ్య, యాదగిరి, ఎస్.కుమార్, లాల్, రాజు, శాంతయ్య, జ్యోతి, డి.లక్ష్మి, హన్మంత్‌నాయక్, స్వామి, సతీష్, తిరుపతయ్య, కొమ్ము లక్ష్మి, వెంకటమ్మ, రాణి తదితరులు పాల్గొన్నారు.

జూరాల ప్రాజెక్టు సందర్శన

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టును డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ మంగళవారం రాత్రి 8.30 గంటల సమయంలో సందర్శించారు. ఫ్లడ్ వివరాలతో పాటు ప్రాజెక్టు నీటి సామర్థ్యం, ఆయకట్టు తదితర ఇరిగేషన్ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. 10 నిమిషాల పాటు ప్రాజెక్టుపై అధికారులు, పోలీసులతో మాట్లాడారు. రాత్రి కావడంతో లెవెల్స్ కనిపించవని అధికారులు వివరించారు. అనంతరం జెన్‌కో గెస్ట్ హౌస్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా గౌడ కుల సంఘం నాయకులు రవీందర్ గౌడ్, వీరన్న గౌడ్ పూలమాలతో సన్మానించారు.

అభివృద్ధే లక్ష్యంగా ముందుకు..

- స్వాతంత్య్ర వేడుకల్లో మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- జిల్లా ప్రగతి నివేదికను చదివిన మంత్రి
- ఉత్తమ ఉద్యోగులకు అవార్డుల అందజేత

వనపర్తి: జిల్లా సర్వతోముఖాభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించిన స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జెడ్పీ చైర్మన్ ఆర్.లోక్‌నాథ్‌రెడ్డి, కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, ఎస్పీ రక్షిత కె.మూర్తితో కలిసి మువ్వన్నెల జెండాను ఆవిష్కరించి వందనం సమర్పించి జాతీయ గీతం ఆలపించారు. అనంతరం జిల్లా ప్రగతి నివేదికను ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులకు చదివి వినిపించారు. ఎందరో మహానుభావుల త్యాగాల ఫలితంగా శతాబ్దాల తర్వాత దేశానికి స్వేచ్ఛ లభించిందని.. వారి త్యాగనీరతిని స్మరించుకోవడంతో పాటు ఆశయ సాధనకు కృషి చేద్దామన్నారు. దేశ భవిష్యత్‌కై పంచవర్ష ప్రణాళికలు రూపొందించి అనేక పథకాలు అమలుచేస్తూ ప్రపంచంలో ఆర్థికంగా, సైనికంగా ఓ బలమైన శక్తిగా భారత్ ప్రపంచ దేశాల సరసన నిలిచిందని చెప్పడానికి గర్వంగా ఉందని వివరించారు. దేశాభివృద్ధిలో తెలంగాణ సింహభాగాన నిలబడుతుందని.. ప్రధానంగా వ్యవసాయ రాష్ట్రమైన తెలంగాణలోని రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ప్రభుత్వం రైతుబంధు, రైతు బీమా, రుణమాఫీ, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించడంతో పాటు రైతు పండించిన పంటను గిట్టుబాటు ధర చెల్లించి కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చొరవ చూపిందన్నారు. జిల్లాలో ఆయిల్‌పాం సాగును ప్రోత్సహించేందుకు రాయితీపై మొక్కలు ఇవ్వడంతో పాటు కాపునకు వచ్చే వరకు ఆర్థిక సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో 5,600 ఎకరాల ఆయిల్‌పాం సాగు లక్ష్యంగా.. 654 మంది రైతులను గుర్తించి ఇప్పటికే 800 ఎకరాల్లో మొక్కలు నాటినట్లు తెలిపారు. మరో 2,101 ఎకరాలను గుర్తించి 1,705 ఎకరాలకు పరిపాలన ఉత్తర్వులు మంజూరు చేశామన్నారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని సకాలంలో పూర్తిచేసి జిల్లాను సస్యశ్యామలం చేస్తామని చెప్పారు. గృహ అవసరాలతో పాటు వ్యవసాయ, పరిశ్రమ, వ్యాపార రంగాలకు నిరంతర నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నామని, ఇళ్లు లేని పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వడంతో పాటు ఇంటిస్థలం పట్టాలివ్వడం, పేద, మధ్యతరగతి కుటుంబాల్లోని మహిళకు సొంత స్థలం ఉంటే ఇల్లు నిర్మించుకునేందుకు గృహలక్ష్మి పథకంలో రూ.3 లక్షల ఆర్థిక సాయం మూడు విడతల్లో మంజూరు చేస్తామన్నారు.

- మిషన్ భగీరథ పథకంలో జిల్లావ్యాప్తంగా ప్రతి రోజు గ్రామీణ ప్రాంతాల్లో మనిషికి 100 లీటర్లు, పట్టణ ప్రాంతంలో 125 లీటర్ల చొప్పున సురక్షితమైన మంచినీటిని సరఫరా చేస్తున్నామన్నారు. జిల్లాలోని మున్సిపాలిటీల్లో మురుగు కాల్వలు, డంపింగ్‌యార్డు నిర్మాణం, వైకుంఠధామం, జంతువుల సంరక్షణ కేంద్రం, పార్కులు, సెంట్రల్ లైటింగ్, మీడియం ప్లాంటేషన్, అమ్మ చెరువు, తాళ్ల చెరువు సుందరీకరణ పనులు చేపట్టామని.. తొలిమెట్టు కార్యక్రమంతో భాషా, గణిత నైపుణ్యాలను బోధించేలా చర్యలు తీసుకుంటున్నామని, జిల్లాలో పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించేందుకు టీఎస్ ఐపాస్‌తో సత్వర అనుమతులు మంజూరు చేస్తున్నామన్నారు.



జాతీయజెండాను ఆవిష్కరించి వందనం సమర్పిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, ఎస్పీ రక్షిత కె.మూర్తి తదితరులు



ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న మంత్రి

పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా గోపాల్‌పేట మండలం ఏదులలో వీరాంజనేయ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణానికి 4,314 ఎకరాల భూమి సేకరించి ఇప్పటి వరకు రైతులకు భూనష్టపరిహారంగా రూ.264 కోట్లు చెల్లించినట్లు వివరించారు.

- ప్రజారోగ్యానికి అత్యంత ప్రాధాన్యమిస్తూ జిల్లాలో వైద్య కళాశాల, సకల సౌకర్యాలతో ప్రభుత్వ ఆస్పత్రి, 14 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 104 ఆరోగ్య ఉప కేంద్రాలు, 4 సామాజిక ఆరోగ్య కేంద్రాలు, రెండు బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. గర్భిణులు, ప్రసవానంతరం పుట్టిన శిశువుల సంరక్షణకు 180 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేసి సేవలు అందిస్తున్నట్లు చెప్పారు.
- జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ నుంచి రూ.64.05 కోట్లతో 1,874 అభివృద్ధి పనులు చేపట్టామని, హరితహారం పథకంలో మొక్కలు నాటి అటవీ శాతాన్ని గణనీయంగా పెంచామన్నారు. ఈ ఏడాది

సాగునీరు, ప్రజారోగ్యం..

21.91 లక్షల మొక్కలు నాటడం లక్ష్యం కాగా.. ఇప్పటి వరకు 9.16 లక్షల మొక్కలు నాటినట్లు తెలిపారు.

- షెడ్యూల్డ్ కులాల అభివృద్ధికి ప్రిమెట్రిక్, పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు ఇవ్వడంతో పాటు 2023–24 సంవత్సరంలో 9 మంది విద్యార్థులకు కార్పొరేట్ కళాశాలల్లో అడ్మిషన్లు ఉచితంగా ఇప్పించామన్నారు.
- కులాంతర వివాహాలు చేసుకున్న జంటలకు ఒక్కొక్కరికి రూ.2.50 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించామని, దళితబంధు పథకం మొదటి విడతలో జిల్లాలో 199 యూనిట్లు రూ.19.70 కోట్లతో గ్రౌండింగ్ చేశామన్నారు.
- క్రీడలను ప్రోత్సహించేందుకు క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయడంతో పాటు ఇటీవలే జిల్లాస్థాయి క్రీడలు నిర్వహించి రాష్ట్రస్థాయి పోటీలకు పంపించినట్లు వివరించారు. పోలీసుశాఖలో ఆధునిక సాంకేతికతతో కేసులు సత్వర పరిష్కారమవుతున్నాయని, సైబర్ నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. అనంతరం ఆయా ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను మంత్రి తిలకించారు. కార్యక్రమంలో దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, అదనపు కలెక్టర్ ఎస్.తిరుపతిరావు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

- చేతివృత్తుల వారికి వందశాతం రాయితీతో రూ.లక్ష ఆర్థిక సాయం అందించేందుకు కార్యాచరణ పూర్తికావస్తోందని తెలిపారు. మైనార్టీశాఖ నుంచి 315 మంది మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేశామని చెప్పారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలు

పెబ్బేరు రూరల్: పట్టణంలోని పీజేపీ ఫుట్‌బాల్ మైదానంలో బుధవారం నుంచి 19వ తేదీ వరకు రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కృష్ణకుమార్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, కలెక్టర్ తేజస్ నందులాల్ పవార్ హాజరవుతారని పేర్కొన్నారు.

సమాజ మార్పునకు యువత కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎండీ జబ్బార్

పాన్‌గల్: సమాజంలో మార్పునకు యువత తమవంతు పాత్ర పోషించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి, డీవైఎఫ్‌ఐ ఉమ్మడి జిల్లా మాజీ కార్యదర్శి ఎండీ జబ్బార్ కోరారు. మంగళవారం మండలంలోని రేమద్దులలో నిర్వహించిన డీవైఎఫ్‌ఐ జిల్లా విస్తృతస్థాయి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. స్వాతంత్య్ర ఉద్యమంలో యువత పాత్ర ఏనలేనిదని.. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ సేవలను కొనియాడారు. ప్రస్తుత ప్రభుత్వాలు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామంటూ యువతకు ఆశజూపి గెలిచిన తర్వాత మొండిచెయ్యి చూపుతున్నాయని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతం, కులం పేరుతో యువత భవిష్యత్‌ను తప్పుదోవ పట్టిస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రాజశేఖర్, నాయకులు కమలాకర్, టీటర్, భాస్కర్‌గౌడ్, ఖాజా, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు కుమార్, మహేష్, అజయ్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

వనపర్తిటౌన్: స్వాతంత్య్ర వేడుకల్లో భాగంగా మంగళవారం సమీకృత కలెక్టరేట్ సముదాయంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. జిల్లాలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు దేశభక్తి గీతాలకు నృత్యాలు చేశారు. మధ్యాహ్నం 12.20 నుంచి సుమారు 45 నిమిషాల పాటు కార్యక్రమం కొనసాగగా.. ప్రాంగణమంతా కరతాళ ధ్వనులతో మార్మోగింది. బాలభవన్ చిన్నారులు చేసిన కూచిపూడి నృత్యం, ట్రైబల్ గురుకుల, రేడియంట్ పాఠశాల విద్యార్థుల గిరిజన నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులను మంత్రి నిరంజన్‌రెడ్డి, కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, ఎస్పీ రక్షిత కె.మూర్తి ప్రత్యేకంగా అభినందించారు.

స్టాళ్ల ఏర్పాటు..

కలెక్టరేట్ ఆవరణలో వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లు ఆకట్టుకున్నాయి. మంత్రి, కలెక్టర్ ప్రతి స్టాల్‌ను సందర్శించారు. తాగునీరు, వ్యవసాయంగాలకు సంబంధించిన స్టాల్స్ ఆకట్టుకున్నాయి.



కూచిపూడి నృత్యం



దేశభక్తి గీతానికి..

కొత్త కేజీబీవీల్లో వెతలు



నేలపై కూర్చొని తరగతులు వింటున్న విద్యార్థినులు (ఫైల్)

- బేంచీలు లేక నేలమీద కూర్చుంటున్న విద్యార్థినులు
- అరకొర ఫర్నీచర్‌తో ఇబ్బందులు పడుతున్న సీఆర్టీలు
- ఏటా పెరుగుతున్న విద్యార్థినుల సంఖ్య

అమరచింత: జిల్లాల పునర్విభజన సమయంలో ఏర్పడిన కొత్త మండలాల్లో ప్రభుత్వం కేజీబీవీలను ప్రారంభించింది. ప్రభుత్వ స్థలాలు గుర్తించి భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేసింది. ప్రస్తుతం అన్ని మండలాల్లో కొత్త భవనాల్లో తరగతులు కొనసాగుతున్నా.. ఫర్నీచర్ లేక విద్యార్థులు నేలమీద కూర్చొని పాఠాలు వింటున్నారు. రూ.కోట్లు వెచ్చించి భవనాలు నిర్మించినా.. ఫర్నీచర్ కొనుగోలుకు నిధులు మంజూరు చేయకపోవడంతో నిత్యం ఇబ్బందుల నడుమ తరగతులు కొనసాగిస్తున్నారు. అలాగే విద్యార్థినులు విశ్రాంతి తీసుకునేందుకు కేటాయించిన గదుల్లో సైతం సరైన వసతులు కల్పించలేదు. జిల్లాలో కొత్తగా ఏర్పడిన అమరచింత, మదనాపురం, రేవల్లి, శ్రీరంగాపురం, చిన్నంబావి కేజీబీవీల్లో ఈ సమస్య ఉండగా.. ప్రస్తుతం ఇంటర్మీడియట్ వరకు తరగతులు కొనసాగుతున్నాయి. కొన్నిచోట్ల సిబ్బందికి సైతం కుర్చీలు, బీరువాలు లేక అవస్థలు పడుతున్నారు. నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందిస్తున్నారే తప్పా సౌకర్యాలు కల్పించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కొత్త కేజీబీవీల్లో ఇలా..

మండలం	విద్యార్థుల సంఖ్య 6 నుంచి 10 వరకు	ఇంటర్మీడియట్
అమరచింత	210	80
మదనాపురం	263	-
రేవల్లి	230	-
శ్రీరంగాపురం	246	20
చిన్నంబావి	238	-

నిఘా నేత్రాలు కరువు..

కొత్త కేజీబీవీల్లో నేటికీ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయలేదు. దీంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదాలు జరుగుతాయోనన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దీనికితోడు కొన్ని మండలాల్లో భవనాలు గ్రామాలకు దూరంగా ఉండటంతో విద్యార్థినులతో పాటు సీఆర్టీలు సైతం భయపడుతున్నారు.

కొత్త కేజీబీవీల్లోనే..



కొత్తగా ఏర్పాటు చేసిన కేజీబీవీల్లోనే ఫర్నీచర్ సమస్య ఉంది. పాత కేజీబీవీల్లో ఎలాంటి ఇబ్బందులు లేవు. సమస్యను ఉన్నతాధికారులకు నివేదించాం. నిధులు మంజూరు చేయాలని కోరాం. త్వరలోనే సమస్యను పరిష్కరిస్తాం.

– శుభలక్ష్మి, జీసీడీఓ

రాష్ట్రవ్యాప్తంగా సమస్య..

రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటుచేసిన కొత్త కేజీబీవీల్లో ఫర్నీచర్ సమస్య ఉంది. ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన తక్షణమే ఫర్నీచర్ సమకూరుస్తాం. – గోవిందరాజులు, డీఈఓ

ఉత్తమ సేవలకు గుర్తింపు



ఎం.నవీన్‌రెడ్డి, జిల్లా అటవీ అధికారి

వనపర్తి: స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా మంగళవారం సమీకృత కలెక్టరేట్‌లో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ సేవలు అందించిన పలువురు అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, ఎస్పీ రక్షిత కె.మూర్తి పాల్గొన్నారు. ప్రశంసాపత్రాలు అందుకున్న వారు..



ఎస్.పద్మావతి, ఆర్డీఓ; నర్సింహులు, డీఆర్డీఓ; వెంకటరమణ, సీపీఓ; బి.చంద్రశేఖర్‌రావు, స్పెషల్ పీపీ; కురుమూర్తి, ఆఫీస్ సబార్డినేట్

జగన్మోహన్, ఎస్‌ఈ; దేశ్యానాయక్, ఈఈ; పి.సీతారాం, డీపీఆర్‌ఓ; అమూల్ పవార్; శ్రీనివాస్, ట్రైబల్ వెల్ఫేర్; ప్రభువినయ్‌కుమార్, ఈఎస్, ఎక్సైజ్; నాగేంద్రకుమార్, ఎస్‌ఈ

తిలక్‌రెడ్డి, కలెక్టర్ సీసీ; లక్ష్మీకాంత్, డీటీ; మధుసూదన్, ఆర్‌ఐ; ఎంఏ రహీం, సీసీ; రవికుమార్, సీ.అ.; షబానా అజ్మి, జూ.అ.; సురేష్ కుమార్

ఉషా, టైపిస్టు; యుగంధర్, ఆపరేటర్; శ్రావణ్, ఆఫీస్ సబార్డినేట్; బి.హేమాజి, ఏఆర్ ఎస్‌ఐ; వినోద్‌కుమార్, ఏఆర్ ఎస్‌ఐ; విజయ్, కానిస్టేబుల్; వెంకట్, కానిస్టేబుల్

శ్రీనివాస్, హెడ్‌కానిస్టేబుల్; బాలస్వామి, హెడ్‌కానిస్టేబుల్; రాంచందర్, హెడ్‌కానిస్టేబుల్; శ్రీనివాస్‌శర్మ, హెడ్‌కానిస్టేబుల్; డి.గోపాల్, హెడ్‌కానిస్టేబుల్; ఆంజనేయులు, ఏఆర్ హెచ్‌సీ; దశరథం, హెడ్‌కానిస్టేబుల్

చంద్రమోహన్‌రావు, హెడ్‌కానిస్టేబుల్; నిరంజన్, కానిస్టేబుల్; సుగుణమ్మ, కానిస్టేబుల్; మునీశ్వర్‌రెడ్డి, కానిస్టేబుల్; శ్రీలత, కానిస్టేబుల్; నాగేశ్వర్‌రావు, కానిస్టేబుల్; తిరుపతి, కానిస్టేబుల్

రాజేష్, కానిస్టేబుల్; రాజా రమేష్, కానిస్టేబుల్; ఆంజనేయులు, కానిస్టేబుల్; బాలరాజు, కానిస్టేబుల్; శ్రీహరి, హోంగార్డ్; స్వర్ణలత, హోంగార్డ్; శ్రీనివాసులు, హోంగార్డ్

క్లుప్తంగా

విద్యార్థి ఆత్మహత్య


గౌతమ్ (ఫైల్)

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రానికి చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థి హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ కళాశాలలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకోగా, మంగళవారం వెలుగు చూసింది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన గౌతమ్ (16) హైదరాబాద్ బొంగుళూరులో ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల కళ్ల కలక రావడంతో ఇంటికొచ్చి సోమవారం ఉదయం తిరిగి కళాశాలకు వెళ్లాడు. సాయంత్రం కళాశాలలో గదిలోకి వెళ్లి వస్తానని స్నేహితులతో చెప్పి ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భోజన సమయంలో గౌతమ్ కనిపించకపోవడంతో కళాశాల యాజమాన్యం వెతకగా గదిలో ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. వెంటనే అతని తండ్రికి ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో కుటుంబ సభ్యులు వెళ్లారు. సోమవారం రాత్రి మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించి, మంగళవారం ఉదయం పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం జిల్లా కేంద్రానికి మృతదేహాన్ని తీసుకొచ్చారు. యాజమాన్యం ఒత్తిడి వల్లే గౌతమ్ మృతిచెందినట్లు కుటుంబసభ్యులు ఆరోపించారు. కొడుకు మృతితో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ట్రక్కు ఢీకొని వ్యక్తి దుర్మరణం


సర్దార్(ఫైల్)

కల్వకుర్తిటౌన్: బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని ట్రక్కు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మంగళవారం కల్వకుర్తిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ సురేష్ కథనం ప్రకారం.. చారకొండ మండలంలోని జూపల్లి గ్రామానికి చెందిన సర్దార్(61) పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. తరచుగా జూపల్లికి వెళ్లి వచ్చేవాడు. సోమవారం పట్టణంలో బంధువుల ఇంటికి వెళ్లిన అతను మంగళవారం ఉదయాన్నే నమాజ్‌పూర్తి చేసుకుని జూపల్లికి బయలుదేరాడు. పట్టణంలోని హైదరాబాద్ చౌరస్తా వద్ద బస్టాండ్ వైపునకు వెళుతున్న ట్రక్కు సర్దార్ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటనపై పోలీసులకు సమచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. అతనికి భార్య ఉంది.

చికిత్స పొందుతూ మహిళ మృతి

పెబ్బేరు రూరల్: మనస్తాపంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మంగళవారం శ్రీ రంగాపురం మండలం జానంపేటలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకటస్వామి కథనం మేరకు.. గద్వాల్ పట్టణానికి చెందిన కోట్ల వెంకటేష్ కూతురు మాదవి(31) ని 12 ఏళ్ల క్రితం బ్రాహ్మణ కొట్కూర్‌కు చెందిన మద్దిలేటికి ఇచ్చి వివాహం చేశారు. పెళ్లైన రెండేళ్ల తర్వాత భార్యాభర్తల మధ్య మనస్పార్థలు రావడంతో విడాకులు తీసుకున్నారు. ఆమెకు జానంపేటకు చెందిన చనమోని శివరాజుతో రెండో పెళ్లి చేశారు. ఈ మధ్య ఆమె ఆరోగ్యం సరిగా లేకపోవడంతో తరచుగా పుట్టింటికి వెళ్తుండేది. సంతానం లేక, ఆరోగ్యం బాగలేక జీవితం మీద విరక్తి చెందిన ఆమె ఈ నెల 10వ తేదీన రాత్రి 10 గంటల సమయంలో ఇంట్లో పురుగుల మందు తాగింది. దీన్ని గమనించిన అత్త, తోటికోడలు వెంటనే పెబ్బేరులోని ఓ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం సోమవారం కర్నూల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చిక్సిత పొందుతూ ఆమె మృతి చెందింది. ఆమె తండ్రి కోట్ల వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పందిని తప్పించబోయి..


బస్వరాజ్(ఫైల్)

మాగనూర్: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడి గాయాలైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మంగళవారం రాయచూర్ ఆస్పత్రిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ మల్లేష్ కథనం ప్రకారం.. కృష్ణ మండలం కున్సీ గ్రామానికి చెందిన బస్వరాజు అతని స్నేహితుడు గోపాల్ కుమారులు మక్తల్‌లో ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్నారు. ఇద్దరు కలిసి సోమవారం బైక్ మీద కుమారుల దగ్గరకు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో సాయంత్రం మండల కేంద్రంలోని మీ సేవ కేంద్రం వద్ద పందిని తప్పించబోయి అదుపుతప్పి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో బస్వరాజుకు తీవ్రగాయాలు కాగా, గోపాల్‌కు స్వల్పగాయాలయ్యాయి. వారిని మాగనూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కర్ణాటక రాష్ట్రం రాయచూర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బస్వరాజు మృతి చెందాడు. ఆయన భార్య సావిత్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

స్వాతంత్య్ర సంబురం




మహబూబ్‌నగర్ పరేడ్ మైదానంలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, లంబాడీల వేషధారణలో బాలికలు


పాలమూరు యూనివర్సిటీలో రెపరెపలాడుతున్న త్రివర్ణ పతాకం


భరతమాత వేషధారణలో బాలిక..

ఓ చిన్నారి నృత్యాభినయం


జోగుళాంబ గద్వాల జిల్లాకేంద్రంలో..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా స్వాతంత్య్ర సంబరాలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్, నారాయణపేట, జోగుళాంబ గద్వాల, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాకేంద్రాల్లోని పరేడ్ మైదానాల్లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. చూడచక్కని వేషధారణలతో విద్యార్థులు దేశభక్తి గేయాలకు అనుగుణంగా నృత్యాలు, ఇతరత్రా విన్యాసాలు చేస్తూ అబ్బురపరిచారు. ఆయా కార్యక్రమాలు ఆహుతులను విశేషంగా అలరించాయి. - సాక్షి నెట్‌వర్క్



నాగర్‌కర్నూల్‌లో నృత్య ప్రదర్శనతో ఆకట్టుకుంటున్న బాలికలు





మహబూబ్‌నగర్‌లో నృత్యం చేస్తున్న విద్యార్థినులు


వనపర్తిలో..


మహబూబ్‌నగర్‌లో ప్రదర్శిస్తున్న శకటాలు

మద్యంమత్తులో యువత ప్రాణాలకు ముప్పు

- చేప వంటకాల పేరిట మద్యం అమ్మకాలు
- జూరాల ఎడమ కాల్వలో ప్రాణాలు గల్లంతు


ఉధృతంగా ప్రవహిస్తున్న ఎడమ కాల్వ


ఎడమ కాల్వ చేప వంటకాల వద్ద జనం రద్దీ

అమరచింత: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాల్వలో ప్రతి ఏడాది సరదాగా ఈతకు వెళ్లిన యువకులు మద్యంమత్తులో నీటిలో కొట్టుకుపోయి ప్రాణాలు పోగొట్టుకున్న సంఘటనలు ఎన్నో ఉన్నాయి. తాజాగా జోగుళాంబ జిల్లా అయిజకు చెందిన మహబూబ్‌పాషా కాల్వలో ఈతకు వెళ్లి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. ఎడమ కాలువ సమీపంలో చేప వంటకాలు ప్రాజెక్టు సందర్శనకు వచ్చే పర్యాటకులను, ఆయా గ్రామాల యువకులను ఆకర్షిస్తూ నిత్యం కిటకిటలాడుతోంది. దీనికి తోడు కొందరు మద్యాన్ని చేప వంటకాల గుడారాల్లో విక్రయిస్తున్నారు. మందు, చేప ముక్కలతో ఎంజాయి చేయడానికి వచ్చేవారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. అక్రమంగా మద్యం విక్రయిస్తే చట్టరిత్యా చర్యలు తీసుకుంటామని చెబుతున్న ఎక్సైజ్ శాఖ అధికారులు వీటి గురించి అసలు పట్టించుకోవడం లేదు. దీంతో ఇక్కడ వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా విరాజిల్లుతోంది. దూర ప్రాంతాల నుంచి వినోదం కోసం వస్తున్న యువకులు ప్రధాన ఎడమ కాల్వలో సరదాగా ఈత పడేందుకు వెళ్లి ప్రాణాలు కోల్పోయారు. పుష్కర ఘాట్ వద్ద నీటిలో సెల్ఫీలు దిగుతూ కాలు జారి కొట్టుకుపోయిన సంఘటనలు చాలా ఉన్నాయి. దీంతో పోలీసులు పుష్కరఘాట్ రహదారి మూసేయడంతో పర్యాటకులను అటువైపు వెళ్లనీయకుండా నివారించారు.

మద్యం విక్రయాలే కారణం..

జూరాల ప్రధాన ఎడమ కాల్వ దగ్గర చేప వంటకాలతో పాటు అక్రమంగా మద్యం అమ్మకాలు చేస్తుండడంతో యువకులు, ఇతర ప్రాంతాల నుంచి పర్యాటకులు విందువినోదాల కోసం ఇక్కడికి వస్తుంటారు. మద్యం మత్తులో ప్రవహిస్తున్న కాలువలోకి దిగే ప్రయత్నాలు చేస్తున్నారు. నాలుగేళ్ల క్రితం మద్యం విక్రయాలపై చర్యలు తీసుకున్న అధికారులు ప్రస్తుతం పట్టించుకోవడం లేదు. దీంతో మద్యం విక్రయాలు జోరందుకున్నాయి.

మద్యం అమ్మకాలు అరికట్టేందుకు చర్యలు



ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాల్వ సమీపంలో చేప వంటకాల తయారీ గుడారాల వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు తెలిసింది. ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో మద్యం అమ్మకాలు, తాగడం నిషేధం. అక్రమంగా మద్యం విక్రయించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. – జగన్మోహన్, ఎస్‌ఐ అమరచింత

కార్మాగారం అభివృద్ధిపై దృష్టి పెట్టాలి


గౌరవ వందనం స్వీకరిస్తున్న కేంద్రం సీఈ సూర్యనారాయణ

దోమలపెంట: శ్రీశైలం భూగర్భ కార్మాగారంలో విధులు నిర్వహిస్తున్న వారు ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, కార్మాగారం అభివృద్ధిపై దృష్టి పెట్టాలని కేంద్ర సీఈ సూర్యనారాయణ అన్నారు. మంగళవారం స్వాతంత్య్ర దినోత్సవం పురస్కరించుకుని ఈగలపెంటలోని సీఈ పరిపాలన కార్యాలయం శక్తి సదన్ వద్ద ఆయన జాతీయ జెండాను ఎగురవేశారు. ఇంజినీర్లు, ఉద్యోగులు, ఆర్టీజియన్లనుద్దేశించి ఆయన మాట్లాడారు. ఎందరో త్యాగ మూర్తుల వల్ల మనకు స్వాతంత్య్రం వచ్చిందన్నారు. రాష్ట్రం, దేశం అభివృద్ధిలో పయనించాలంటే నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలన్నారు. అంతకుముందు డా.బీఆర్ అంబేద్కర్, తెలుగు తల్లి విగ్రహాలకు పూలమాలలు వేసి కేంద్రం ప్రత్యేక రక్షణ దళం ఎస్‌పీఎఫ్ పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో ఇంజినీర్లు, ఉద్యోగులు, ఆర్టీజియన్లు పాల్గొన్నారు.

పంపిణీ గొర్రెలపై దళారుల దందా

మక్తల్: రాష్ట్ర ప్రభుత్వం గొల్ల, కుర్వలకు జీవనోపాధికోసం గొర్రెలను పంపిణీ చేస్తే వారు దళారులుగా మారి అమ్ముకున్న ఘటన మంగళవారం మక్తల్ మండలం ముస్లాయిపల్లిలో చోటుచేసుకుంది. ముస్లాయిపల్లి గ్రామానికి ప్రభుత్వం 24 మంది లబ్ధిదారులను గొర్రెల పంపిణీనికి ఎంపిక చేసింది. అనంతపురం జిల్లా నుంచి మూడు డీసీఎంలతో గొర్రెలను తెచ్చి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. గ్రామంలో కుర్వకులస్తులు నలుగురు దళారీగా ఏర్పడి కమీషన్‌కు కక్కుర్తిపడి మిగతా లబ్ధిదారులను ఒప్పించారు. అమరచింత మండలం మస్తీపూర్‌కు చెందిన వ్యక్తితో పరిచయం ఏర్పరుచుకొని

బెడిసి కొట్టిన బేరం

లబ్ధిదారులు నుంచి 16 యూనిట్లను 24 లక్షలకు బేరం కుదుర్చుకున్నారు. సోమవారం గ్రామం నుంచి రోడ్డుపై గొర్రెల మందను కాపరులు తీసుకెళ్తున్నారు. సత్యవార్ గ్రామం చేరగానే కొనుగోలుదారుడు ప్రభుత్వం గొర్రెల కొనుగోలు వల్ల గొడవలవుతాయనే భయంతో గొర్రెలను తిరిగి ముస్లాయిపల్లికి పంపించాడు. డబ్బులొస్తాయని ఆశపడిన దళారీలకు బేరం బెడిసికొట్టింది. జీవనోపాధికి ప్రభుత్వం పంపిణీ చేసిన గొర్రెలను అమ్ముకోవడం ఏమిటని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

పట్టపగలే చోరీ

14 తులాల బంగారం, రూ.4 లక్షల నగదు అపహరణ


మక్తల్‌లో చోరీకి పాల్పడిన ఇల్లు


బంగారం ఎత్తుకెళ్లి పడేసిన బాక్సులు

మక్తల్: ఇంటికి తాళం వేసి దేవాలయానికి వెళ్లి వచ్చేలోపే గుర్తుతెలియని దుండగులు తాళం విరగొట్టి ఇంట్లో ఉన్న బంగారం, నగదు చోరీ చేసిన ఘటన మక్తల్‌లో చోటుచేసుకుంది. ఎస్‌ఐ పర్వతాలు కథనం ప్రకారం.. మక్తల్ పట్టణం సంగంబండ రోడ్ సమీపంలోని సాయినగర్ కాలనీలో కట్ట వీరశేఖర్ నివాసం ఉంటున్నాడు. భార్యాభర్తలు స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఉదయం 7.40 గంటలకు ఇంటికి తాళం వేసి పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయానికి పూజ చేసేందుకు వెళ్లారు. ఉదయం 9.30గంటలకు తిరిగి ఇంటికొచ్చి చూసే సరికి తాళం బద్దలుకొట్టి కనిపించింది. వెంటనే బెడ్రూంలో వెళ్లి చూడగా కబోర్డులో ఉన్న 14 తులాల బంగారం, కిరాణం సామను కోసం దాచిన రూ.4లక్షల నగదు కనిపించలేదు. దీంతో దొంగతనం జరిగిందని వెంటనే మక్తల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మక్తల్ సీఐ రాంలాల్, ఎస్‌ఐ పర్వతాలు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఇంటి దగ్గర ఖాళీ స్థలంలో ఇద్దరు వ్యక్తులు ఎర్రటోపీలు, మాస్కులు పెట్టుకొని తిరిగినట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. సంగంబండ రోడ్డు వెంట ఉన్న సీసీపుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు.

ఆటో, డీసీఎం ఢీ : ఆరుగురికి గాయాలు


క్షతగాత్రులను తరలిస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

ఎర్రవల్లిచౌరస్తా: కూలీలతో వెళ్తున్న ఆటోను అతివేగంగా డీసీఎం ఢీకొట్టిన ప్రమాదంలో ఆరుగురికి గాయాలైన ఘటన మంగళవారం ఇటిక్యాల మండల పరిధిలోని కొండేరు స్టేజీ వద్ద చోటుచేసుకుంది. ఎస్‌ఐ అశోక్‌బాబు కథనం మేరకు.. కొండేరుకు చెందిన బోయ రమేష్ తన ఆటోలో కూలీలను తీసుకొని కర్నూల్ వైపు వెళ్తున్నాడు. కొండేరు స్టేజీ జాతీయ రహదారిపై యూటర్న్ తీసుకుంటుండగా, హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు వెళ్తున్న డీసీఎం వేగంగా వచ్చి ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో పూర్తిగా ధ్వంసమైంది. ఆటోలో ఉన్న బోయ జయమ్మ, తెలుగు మహేశ్వరి, బోయ గీత, బోయ పద్మమ్మ, బోయ చిన్న జయమ్మ, బోయ నర్సమ్మలకు తీవ్ర గాయాలయ్యాయి. అటువైపు వెళ్తున్న ఎమ్మెల్యే అబ్రహం గమనించి స్థానికుల సహాయంతో క్షతగాత్రులను హుటాహుటిన తన వాహనంలో, అంబులెన్స్‌లో కర్నూల్‌కు తీసుకెళ్లి మానవత్వం చాటుకున్నారు. ఆటో డ్రైవర్ ఫిర్యాదు మేరకు డీసీఎం డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉప ఎన్నికల్లోనూ సగానికిపైగా ఏకగ్రీవాలు

- 66 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరుగుతుంటే 32 ఏకగ్రీవం.. మరో 32 చోట్ల పోటీ

సాక్షి, అమరావతి: ఏపీలో 484 మండలాల పరిధిలో మొత్తం 1,033 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు జరగనున్న ఉప ఎన్నికల్లో సగానికి పైగా స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. ఆయా గ్రామాల్లో మొత్తం 66 సర్పంచ్ స్థానాలతో పాటు 1,064 వార్డు సభ్యులకు ఉప ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నోటిఫికేషన్ జారీచేసిన విషయం తెలిసిందే. పదో తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ కొనసాగగా, సోమవారం సా.3 గంటలకు నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగిసింది. అన్ని జిల్లాల నుంచి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కార్యాలయానికి అందిన సమాచారం మేరకు.. సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరిగే మొత్తం 66 గ్రామాల్లో 32 చోట్ల ఎన్నిక ఏకగ్రీవం కాగా, రెండుచోట్ల అభ్యర్థులెవరూ నామినేషన్లు దాఖలు చేయలేదు. కేవలం 32 చోట్ల మాత్రమే సర్పంచ్ స్థానాలకు ఈనెల 19న పోలింగ్ జరగనుంది. మరోవైపు.. 1,064 వార్డు సభ్యులకు ఉప ఎన్నికలు జరుగుతుండగా.. 757 స్థానాలు ఏకగ్రీవం కాగా, 261 చోట్ల 19న పోలింగ్ జరగనుంది.

పుంగనూరు నిందితులంతా పాత నేరస్తులు

దాడుల కోసం పార్టీలో గూండాలను ఎంపిక చేసి మరీ తెచ్చిన టీడీపీ

సాక్షి, చిత్తూరు, పుంగనూరు (చిత్తూరు జిల్లా): చిత్తూరు జిల్లా పుంగనూరులో ఇటీవల తెలుగుదేశం పార్టీ సృష్టించిన విధ్వంసంలో విస్తుపోయే నిజాలు వెలుగుచూస్తున్నాయి. పక్కా ప్రణాళిక, భారీ వ్యూహంతోనే ఈ దాడులు జరిగినట్లు స్పష్టమవుతోంది. అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజలకు చేరువైన వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని గద్దె దింపడం, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని రాజకీయంగా అణగదొక్కటమే లక్ష్యంగా టీడీపీ ఈ దాడులకు వ్యూహ రచన చేసింది. పక్కా ప్రణాళికతో జిల్లా నలుమూలల నుంచి టీడీపీకి చెందిన గుండాలను ఎంపిక చేసి మరీ పుంగనూరుకు తెచ్చినట్లు వెల్లడైంది. వారిపై జిల్లాలోని పలు పోలీసు స్టేషన్లలో అనేక కేసులు ఉన్నాయి. వీరిని ముందుగానే మారణాయుధాలతో సహా పుంగనూరులో మోహరించారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

అంటరానితనంపై యుద్ధం

విజయవాడలో 77వ స్వాతంత్య్ర దినోత్సవంలో ఏపీ సీఎం వైఎస్ జగన్

“అంటరానితనం అంటే ఫలానా వ్యక్తులు తాకటానికి వీల్లేదని భౌతికంగా దూరం పెట్టటం మాత్రమే కాదు.. వారికి అందాల్సిన సంక్షేమాన్ని అడ్డుకోవడం కూడా అంటరానితనమే.. అలాంటి రూపం మార్చుకున్న అంటరానితనంపై ఈ రోజు మనం యుద్ధం చేస్తున్నాం! పేదలు గెలిచేదాకా, వారి బతుకులు బాగుపడే వరకు ఇది కొనసాగుతుంది.
- ఏపీ సీఎం వైఎస్ జగన్

- భౌతికంగా దూరం పెట్టడం ఒక్కటే కాదు.. సంక్షేమాన్ని అడ్డుకోవడం కూడా అంటరానితనమే
- మున్సిపల్ స్టేడియంలో జాతీయ జెండాను ఆవిష్కరించి సాయుధ దళాల వందనాన్ని స్వీకరించిన సీఎం

సాక్షి, అమరావతి: రూపం మార్చుకున్న అంటరానితనం, పేద వర్గాలను అణచివేస్తున్న పెత్తందారీ భావజాలం ధోరణులపై ఈ నాలుగేళ్ల పాలనలో యుద్ధాన్ని ప్రకటించామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. మంగళవారం 77వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జాతీయ జెండాను ఆవిష్కరించిన సీఎం జగన్ సాయుధ దళాల గౌరవ వందనాన్ని స్వీకరించారు. మహనీయుల త్యాగనిరతి, స్వాతంత్య్ర సమర యోధుల బలి దానాలను గుర్తు చేస్తూ ప్రసంగించారు. స్వతంత్ర భారత దేశ చరిత్రలో మరే ప్రభుత్వం, రాష్ట్రం చేయని గొప్ప మార్పులు, గ్రామ స్వరాజ్యానికి అసలైన అర్థాన్ని నాలుగేళ్లలోనే తెచ్చామని చెప్పారు. '76 ఏళ్ల ప్రయాణంలో మన దేశం, రాష్ట్రం ఎంతో పురోగమించాయని చెప్పేందుకు పలు ఉదాహరణలు కనిపిస్తాయి. ఆర్థిక వ్యవస్థకు మూలమైన వ్యవసాయం, పరిశ్రమలు, సేవలు లాంటి మూడు రంగాలలో ఎంతో ప్రగతి కనిపిస్తుంది. కానీ అదే సమయంలో ఈ వేగాన్ని అందుకోలేని, అందుకునే అవకాశాలు తగినంతగా లభించని కుటుంబాలు, వర్గాలు, సామాజిక వర్గాలు, ప్రాంతాలు ఈ ఏడు దశాబ్దాల ప్రయాణంలో ఇంకా వెనకబడే ఉన్నాయి' అని పేర్కొన్నారు. సీఎం జగన్ తన ప్రసంగంలో ఇంకా ఏమన్నారంటే..

రూపం మార్చుకున్న అంటరానితనం, పెత్తందారీ భావజాలం..

అంటరానితనం అంటే కేవలం భౌతికంగా దూరం పెట్టటం మాత్రమే కాదు! పేదలు ఏ బడిలో చదువుకుంటున్నారో ఆ గవర్నమెంట్ బడిని పాడు పెట్టడం! డబ్బున్న వారి పిల్లలకు ఒక మీడియం, పేదల పిల్లలకు మరో మీడియం అని వివక్ష పాటిస్తూ పేద బిడ్డలు తెలుగు మీడియంలోనే చదవాలని బరితెగించి వాదించటం కూడా అంటరానితనమే! పేదలు ఏ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకుంటున్నారో అక్కడ ఉచిత సేవలు అందకుండా చేయటం, పేదలు ఏ బస్సు ఎక్కుతున్నారో ఆ బస్సును ప్రైవేట్‌కు విక్రయించాలని చూడటం, పేదలు కోరుకునే చిన్నపాటి ఇంటి స్థలం, ఇంటిని వారికి ఇవ్వకుండా ఆత్మగౌరవాన్ని దెబ్బతీయటం, చివరికి కోర్టుల్లో రకరకాల కేసులు వేసి పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు కట్టించి ఇవ్వటానికి వీల్లేదని అడ్డుకోవటం కూడా అంటరానితనమే! పౌర సేవలు ఏవి కావాలన్నా పేదలు, మధ్యతరగతి వర్గాల వారు కార్యాలయాలు, కమిటీల చుట్టూ తిరిగేలా వారి సహనాన్ని పరీక్షించటం, అవ్వాతాతలు పెన్షన్ అందుకోవాలన్నా, రైతన్నలకు ఎరువులు కావాలన్నా పొద్దున్నే లేచి పొడవాటి క్యూల్లో నిలబడి, చివరికి ఆ క్యూ లైన్లలో మనుషులు చనిపోతున్నా పాలకుల గుండెలు కరగకపోవటం... ఇవన్నీ రూపం మార్చుకున్న అంటరానితనం, పెత్తందారీ భావజాలంలో భాగాలే. స్వాతంత్య్రం వచ్చి 76 ఏళ్లు గడిచినా ఇప్పటికీ అలాగే మిగిలి ఉన్న, రూపం మార్చుకున్న అంటరానితనంపై యుద్ధం చేస్తున్న ప్రభుత్వం మనది. పేదలు గెలిచే వరకూ, వారి బతుకులు బాగుపడేవరకూ ఈ యుద్ధం కొనసాగుతుంది.



విజయవాడలో జరిగిన స్వాతంత్య్ర దినోత్సవ కార్యక్రమంలో జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న సీఎం వైఎస్ జగన్



మెడల్స్ ప్రదానం సందర్భంగా కింద పడిపోయిన మెడల్‌ను తీసి పోలీస్‌కు పిన్ చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

దుష్ట సంప్రదాయాన్ని తుదముట్టించాం

ఎన్నికల సమయంలో ప్రకటించే మేనిఫెస్టోను ఆ తరువాత చెత్తబుట్టలో పడేసే దుష్ట సంప్రదాయాన్ని మనం తుదముట్టించాం. మేనిఫెస్టోను భగవద్గీత, బైబిల్, ఖురాన్‌గా భావిస్తూ ఇందులో ఇవి చెప్పాం.. ఇవి చేశాం.. 98.5 శాతం వాగ్దానాలను ఇప్పటికే అమలు చేశామని ప్రింట్ తీసి మరీ గడప గడపకూ వెళ్లి చూపిస్తూ ప్రజల ఆశీస్సులు తీసుకుంటున్నాం. సామాజిక న్యాయం అన్నది కేవలం నినాదం కాదు.. అది అమలు చేయాల్సిన విధానమని నిరూపిస్తూ మంత్రి మండలిలో ఏకంగా 68 శాతం పదవులను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకే ఇచ్చాం. ఐదుగురు ఉప ముఖ్యమంత్రుల్లో నలుగురు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల వారే. వికేంద్రీకరణను విధానంగా మార్చుకుని రాష్ట్రం ఏర్పడిన తరవాత మరో 13 కొత్త జిల్లాలను ఏర్పాటు చేశాం. రాజధానులను కూడా మూడు ప్రాంతాల హక్కుగా, రాష్ట్ర ప్రభుత్వ బాధ్యతగా వికేంద్రీకరణ చేయబోతున్న ప్రభుత్వం కూడా మనదే. ప్రభుత్వం ఖర్చు పెట్టే ప్రతి రూపాయిలో కేవలం 15 పైసలు మాత్రమే లబ్ధిదారులైన ప్రజలకు చేరుతున్నాయని దాదాపు 38 ఏళ్ల క్రితం అప్పటి ప్రధాని చెప్పిన మాటలు ఇప్పటికీ ప్రచారంలో ఉన్నాయి. గత 50 నెలల్లో ఎలాంటి అవినీతి, లంచాలు, వివక్షకు తావు లేకుండా ఏకంగా రూ.2.31 లక్షల కోట్లను అత్యంత పారదర్శకంగా పేదలకు అందించాం. డీబీటీతో నేరుగా ఖాతాల్లోకి జమ చేశాం. సంక్షేమ పథకాలన్నీ అక్కచెల్లెమ్మల బ్యాంకు ఖాతాలకే ట్రాన్స్‌ఫర్ చేస్తున్నాం. మహిళా సాధికారతకు బాటలు వేశాం. సోషల్ ఆడిట్‌ను తప్పనిసరి చేయటం ద్వారా పారదర్శకంగా లబ్ధి చేకూరుస్తున్నాం.

2047 నాటికి | ఏపీని నంబర్ వన్ చేస్తా

- అభివృద్ధి ఆలోచనలన్నీ నావే
- హైదరాబాద్‌లో స్కూల్ నుంచి వర్సిటీ వరకు నేనే అభివృద్ధి చేశా
- అవినీతి, నేరాల్ని కాపాడుకుంటే సంక్షేమం పరుగులు పెడుతుంది
- సంస్కరణల ఫలితంగా కోవిడ్‌లోనూ గ్రోత్ వచ్చిన రాష్ట్రం ఇండియా
- ఇంజనీరింగ్ చేయాలంటే బైపీసీ చదవాలి
- ఇండియా విజన్–2047 డాక్యుమెంట్ ఆవిష్కరణలో చంద్రబాబు




సాక్షి, విశాఖపట్నం : మళ్లీ తనని అధికారంలోకి తీసుకొస్తే.. 2047 నాటికల్లా ఆంధ్రప్రదేశ్‌ని నంబర్ వన్ చేస్తానని, తనని గెలిపించే బాధ్యత మీరు తీసుకుంటే అభివృద్ధి చేసే బాధ్యత తాను తీసుకుంటానని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు అన్నారు. చంద్రబాబు చైర్మన్‌గా వ్యవహరిస్తున్న గ్లోబల్ ఫోరం ఫర్ సస్టైనబుల్ ట్రాన్స్‌ఫర్మేషన్ (జీఎఫ్‌టీసీ) సంస్థ రూపొందించిన ఇండియా విజన్–2047 డాక్యుమెంట్‌ని ఆయన మంగళవారం విశాఖ ఎంజీఎం గ్రౌండ్స్‌లో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అవినీతి, నేరాల్ని కాపాడుకుంటేనే సంక్షేమం పరుగులు పెడుతుందని వ్యాఖ్యానించారు. స్వాతంత్య్రం వచ్చినా అవినీతి పోలేదని, అందుకే ఫ్రీ ఫ్రం కరెప్షన్, ఫ్రీ ఫ్రం క్రైమ్ అనే నినాదంతో ముందుకెళ్దామని అన్నారు. పీపుల్ పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీ4) మోడల్‌తో పేదరికం లేని సమాజం సాధ్యమవుతుందన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే కరెంట్ చార్జీలు తగ్గిస్తామని హామీ ఇచ్చారు. బటన్ నొక్కడం వల్ల ఎవరికి లాభమో చూడాలే తప్ప, ఉత్తుత్తి బటన్‌లు నొక్కడం కాదన్నారు. విద్యుత్, గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్, టెలికమ్యూనికేషన్, హైవేల నుంచి దేశంలో అమలైన ప్రతి ఒక్కటీ తన ఆలోచనే అని చెప్పారు. హైదరాబాద్‌లో ఎలిమెంటరీ స్కూల్ నుంచి యూనివర్సిటీ వరకు తన వల్లే అభివృద్ధి చెందాయన్నారు. డబ్బులు ఎలా సంపాదించాలో చాలా మందికి నేర్పించానన్నారు.

విజన్ డాక్యుమెంట్ అట్టర్‌ఫ్లాప్

ఇండియా విజన్–2047 పేరుతో చంద్రబాబు చేసిన షో అట్టర్‌ఫ్లాప్ అయ్యింది. మేధావులు, విద్యావేత్తలు, విద్యార్థులు పాల్గొన్న సభలో చెప్పిన మాటలే చెప్పి, తానే గొప్పంటూ డబ్బా కొట్టుకొని, అందులోనూ సవాలక్ష తప్పులు చెప్పడంతో అందరూ మధ్యలోనే వెళ్లిపోయారు. చంద్రబాబు మాట్లాడుతుండగానే 80 శాతం ఖాళీ అయిపోయింది. ఆయన రావడమే రెండు గంటలు ఆలస్యం. వచ్చీరాగానే అడ్డగోలు అబద్ధాలు చెబుతుండటంతో అందరూ విసుక్కొంటూ వెళ్లిపోయారు. ఆర్థిక సంస్కరణల ఫలితంగా కోవిడ్ సమయంలోనూ గ్రోత్ వచ్చిన ఏకైక రాష్ట్రం భారత్ అని చెప్పడంతో అందరూ నవ్వుకున్నారు. హైదరాబాద్‌లో ఎలిమెంటరీ స్కూల్ నుంచి యూనివర్సిటీ వరకు అన్నీ తానే అభివృద్ధి చేశానని, ఆర్థిక సంస్కరణలకు బాటలు వేశానని, విద్యుత్ నుంచి రోడ్ల వరకూ ఎలా డెవలప్ చెయ్యాలో కేంద్రానికి రిపోర్టులు ఇచ్చిందీ తానే అని అనడంతో అందరూ విస్తుపోయారు. ఇంటర్‌లో ఇంజినీర్ కావాలంటే బైపీసీ చదవాలని చెప్పడంతో అందరికీ బుర్రలు తిరిగిపోయాయి. అవినీతి, నేరాల్ని కాపాడుకుంటనే సంక్షేమం పరుగులు పెడుతుందని ఓ సందర్భంలో చెప్పడంతో విన్న వారందరూ అవాక్కయ్యారు.

ఇక విజన్ 2047పై దృష్టి

- మహిళా నేతల సమావేశంలో పవన్‌కళ్యాణ్
- ఇప్పుడున్న పథకాలన్నీ కొనసాగిస్తామని హామీ



సాక్షి, అమరావతి: విజన్–2020 అయిపోయిందని.. ఇకపై విజన్–2047పై దృష్టి పెట్టాలని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేసిన అనంతరం పార్టీ మహిళా నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విజన్ 2047 గురించే ఇప్పుడు అందరూ మాట్లాడుతున్నారన్నారు. ప్రస్తుతం 2023 నడుస్తోందని.. 2047 నాటికి ఉపాధి అవకాశాలు బాగుండాలని, మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని తాను కోరుకుంటున్నానన్నారు. పెరుగుతున్న సంపద అంతా రాజకీయాల్లోకి వచ్చి పదవులు పొంది దోపిడీ చేసే కొందరి వద్దే పేరుకుపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. బ్రిడ్జి కట్టినా ముఖ్యమంత్రులకు కమీషన్లు ఇవ్వాల్సి వస్తోందని.. ఆంధ్రాలో అయితే 8 శాతం అంటున్నారన్నారు. సరైన వ్యక్తులకు ఓటు వేయకపోతే 2047 కల్లా మన బిడ్డలను మనమే సర్వనాశనం చేసుకుంటామని వ్యాఖ్యానించారు.

పథకాలేవీ ఆగవు

వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాకపోతే పథకాలు ఆగిపోతాయేమో.. సంక్షేమం నిలిచిపోతుందేమో అనుకోవద్దని పవన్ పేర్కొన్నారు. భవిష్యత్‌లో ప్రస్తుత పథకాల కంటే పదింతలు ఎక్కువగా గొప్ప పథకాలే ఉంటాయి తప్ప ఈ పథకాలు తీసేసే పరిస్థితి ఉండదన్నారు. ప్రతి ఒక్కరికీ మాట ఇస్తున్నానని.. జగన్‌ను ఎన్నుకోకపోతే ఏం జరుగుతుందో అనే మాట అవసరం లేదన్నారు.

ట్యాంకర్ ఢీకొని వ్యక్తి మృతి

ఎర్రవల్లిచౌరస్తా: జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ట్యాంకర్ ఢీకొట్టడంతో వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన ఇటిక్యాల మండలం వేముల శివారులో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ కృష్ణదేవ కథనం మేరకు.. వేముల గ్రామానికి చెందిన అశోక్(33) పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై కోదండాపురం వెళ్లి తిరిగొస్తున్నాడు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై వేముల శివారులోకి రాగానే హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు వెళ్తున్న ట్యాంకర్ వెనక నుంచి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అశోక్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని గద్వాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు. అతని భార్య సంధ్య ఫిర్యాదు మేరకు ట్యాంకర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

జడ్చర్ల వంతెనపై మహిళ..

జడ్చర్ల: పట్టణంలోని 44వ నెంబరు జాతీయ రహదారి వంతెనపై గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. సీఐ రమేష్‌బాబు కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం బావాజి గ్రామానికి చెందిన చిట్టి అలియాస్ షబాన(35) కొంతకాలంగా భర్తతో గొడవ పడి జడ్చర్లలో నివాసం ఉంటోంది. సోమవారం రాత్రి ఆమె జాతీయ రహదారిపై ఉండగా, కర్నూల్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మృతదేహాన్ని బాదేపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఆమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

అనుమానాస్పదంగా వ్యక్తి..

జడ్చర్ల: అనుమానాస్పందగా వ్యక్తి మృతి చెందిన ఘటన పాతబజార్‌లో చోటుచేసుకుంది. సీఐ రమేష్‌బాబు కథనం ప్రకారం.. పాతబజార్‌కు చెందిన జీనుగ బాలయ్య(30) ఆదివారం రాత్రి 11గంటల సమయంలో ఇంటి నుంచి బయటికి వెళ్లి సోమవారం తెల్లవారుజామున ఇంటికి తిరిగి వచ్చాడు. అనంతరం తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. భార్య నాగలక్ష్మి వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నించినా చెప్పలేదు. తీవ్ర అస్వస్థతకు గురైన ఆయన నీళ్లు తాగి కూర్చున్న చోటే మృతి చెందాడు. భర్త ఒంటిపై అక్కడక్కడ గాయాలున్నాయని, ఆయన మరణంపై అనుమానం ఉన్నట్లు భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

జూరాలకు స్వల్ప ప్రవాహం

- 11వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- జెన్‌కో జల విద్యుత్ కేంద్రంలో రెండు యూనిట్లలో విద్యుదుత్పత్తి
- 10,671 క్యూసెక్కులు విడుదల



నెట్టెంపాడు లిఫ్టు2లో కొనసాగుతున్న నీటి పంపింగ్

ధరూరు : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న ఇన్‌ఫ్లోలు స్వల్పంగా కొనసాగుతోందని పీజేపీ అధికారులు తెలిపారు. సోమవారం సాయంత్రానికి 10వేల 500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, మంగళవారం రాత్రి 8 గంటల వరకు ప్రాజెక్టుకు 10వేల క్యూసెక్కుల వరద వస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో రెండు పంపు ద్వారా నీటి పంపింగ్ కొనసాగుతున్నట్లు తెలిపారు. జెన్‌కో జల విద్యుత్ కేంద్రంలో రెండు యూనిట్లలో విద్యుదుత్పత్తిని ప్రారంభించారు. విద్యుదుత్పత్తి నిమిత్తం ప్రాజెక్టుకు నుంచి 7వేల 180 క్యూసెక్కులు, రెండు పంపుల ద్వారా 1500 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఆవిరి రూపంలో 113 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315 క్యూసెక్కులు, జూరాల ఎడమ కాలువకు 870 క్యూసెక్కులు, కుడి కాలువకు 691 క్యూసెక్కులు, ప్రాజెక్టు నుంచి మొత్తం 10వేల 671 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 8.670 టీఎంసీలు నిల్వ ఉంది. ఎగువనున్న ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల నుంచి స్వల్ప వరద వస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఆల్మట్టి నుంచి 4వేల 793 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 731 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 129.72 టీఎంసీలు కాగా, 122.834 టీఎంసీలు నిల్వ ఉంది. నారాయణపూర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 37.64 టీఎంసీలు కాగా, ప్రస్తుతం ప్రాజెక్టులో 31.09 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి 9వేల 479 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు.

రామన్‌పాడు నుంచి 1,787 క్యూసెక్కుల నీటి వినియోగం

మదనాపురం: మదనాపురం మండలంలోని రామన్‌పాడు జలాశయం నుంచి మంగళవారం 1,788 క్యూసెక్కుల నీటిని వినియోగించారు. ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటిమట్టం 1,019 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాలువ ద్వారా 870 క్యూసెక్కులు, సమాంతర కాలువ ద్వారా 400 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఎన్‌టీఆర్ కాలువ ద్వారా వ్యవసాయ అవసరాలకు 900 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాలువ ద్వారా 20 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు. భీమా ఫేస్ టూ ద్వారా 847 క్యూసెక్కులు, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు ఏఈ రనీల్‌రెడ్డి తెలిపారు.

శ్రీశైలంలో 862.7 అడుగుల నీటిమట్టం

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో మంగళవారం 862.7 అడుగుల నీటిమట్టం, 114.4888 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 12,000 క్యూసెక్కులు, రేగుమాన్ గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకి 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 6.595 మిలియన్ యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి చేసి 12,732 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదిలారు.

ఆలయ ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలి



సమావేశమైన పాలకమండలి సభ్యులు

జోగుళాంబ శక్తిపీఠం: జోగుళాంబ ఆలయంలో అనుచిత ప్రవర్తనపై ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆలయ సీనియర్ అసిస్టెంట్ రంగనాథ్ పై చర్యలు తీసుకోవాలని పాలక మండలి ఏకగ్రీవ తీర్మానం చేసింది. మంగళవారం రాత్రి ఆలయ చైర్మన్ చిన్న కృష్ణయ్య పాలకమండలి అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి జరిగిన పరిణామాలు, ప్రస్తుతం సామాజిక మాధ్యమాలలో వస్తున్న కథనాలు, పూజారులు, భక్తుల నుంచి వస్తున్న ఫిర్యాదులపై చర్చించారు. దేవదాయశాఖ చట్టంలోని 37 యాక్ట్ ప్రకారం ఆలయ సీనియర్ అసిస్టెంట్‌పై తక్షణ చర్యలు తీసుకోవాలని పాలక మండలి సభ్యులంతా ఏకగ్రీవ తీర్మానం చేశారు. సమావేశంలో ఆలయ పాలకమండలి సభ్యులు చంద్రకళ, వెంకటేశ్వర్ రెడ్డి, అంపయ్య, అడవన్న, వెంకటేష్, సత్యనారాయణ, సత్యన్న, కేశన్న ఎక్స్ అఫిషియో సభ్యుడు ఆనంద్ శర్మ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రాజాపూర్: రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. బాలానగర్ ఎస్‌ఐ శ్రీనివాస్ వివరాల ప్రకారం.. మండల పరిధిలోని జాతీయరహదారి44పై జీవీకే ముందు మంగళవారం తెల్లవారుజామున రోడ్డుపై గుర్తు తెలియని వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లారు. మృతి చెందిన వ్యక్తి (45) బ్లూ కలర్ జీన్స్‌ప్యాంట్ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం షాద్‌నగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అబద్ధాలతో నీళ్లు ఎలా వస్తాయి?

మరికల్: 60 శాతం కూడా పూర్తి కాని కర్వెన ప్రాజెక్టు నుంచి నారాయణపేటకు నీళ్లు తీసుకోస్తామని ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి చెప్పే అబద్ధాలతో నీళ్లు ఎలా వస్తాయని టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు వీరన్నలు అన్నారు. మరికల్‌లో మంగళవారం వారు విలేకర్లతో మాట్లాడారు. కర్వెన ప్రాజెక్టు పూర్తి అయిందని మరో మూడు నెలల్లో నారాయణపేటకు నీళ్లు వస్తాయని, చోటామోటా నాయకులతో వెళ్లి కర్వెన ప్రాజెక్టును సందర్శించడం ఎమ్మెల్యేకు సిగ్గుచేటన్నారు. పక్కనే ఉన్న కృష్ణానదిని వదిలి శ్రీశైలం బ్యాక్‌వాటర్ నీళ్లు జిల్లాకు తెస్తామనడం హాస్యస్పదంగా ఉందన్నారు. సమావేశంలో వారితోపాటు హరీష్, కృష్ణయ్య, రఘు, రవి ఉన్నారు.



దేశానికే దిక్సూచిగా తెలంగాణ

- ఎంపీ రాములు



అచ్చంపేటలో మాట్లాడుతున్న ఎంపీ రాములు

అచ్చంపేట రూరల్: రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతూ, దేశానికే దిక్సూచిగా తెలంగాణ నిలుస్తోందని నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు అన్నారు. మంగళవారం అచ్చంపేటలోని ఎంపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల ఓ సంస్థ నిర్వహించిన సర్వేలో తెలంగాణ రాష్ట్రం మూడో స్థానంలో ఉన్నట్లు ప్రకటించిందన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం, నీటిపారుదల, విద్యుత్ రంగాల్లో ఇతర రాష్ట్రాలకు దీటుగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. దేశానికే ఆహార ధాన్యాలను సరఫరా చేసే స్థాయికి రాష్ట్రం ఎదిగిందన్నారు. ప్రతిపక్షాలు పగటి కలలు కంటున్నాయని, ముచ్చటగా మూడోసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని జోష్యం చెప్పారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ కందికొండ శ్రీధర్, నాయకులు శరణ్‌గౌడ్, నజీర్, గోపాల్, ఖలీల్, శివ ఉన్నారు.

బీఆర్‌ఎస్ మళ్లీ అధికారంలోకి రావాలి

- డిప్యూటీ స్పీకర్ పద్మారావు



ఆలయంలో పూజలు చేస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావు

జోగుళాంబ శక్తిపీఠం: ప్రజల క్షేమమే పరమావధిగా పని చేస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రావాలని జోగుళాంబదేవిని ప్రార్థించినట్లు డిప్యూటీ స్పీకర్ పద్మారావు అన్నారు. మంగళవారం ఆయన స్థానిక ఎమ్మెల్యే అబ్రహంతో కలిసి అలంపూర్ జోగుళాంబ అమ్మవారిని దర్శించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ చిన్నకృష్ణయ్య, ఈవో పురేందర్, ఆలయ కమిటీ సభ్యులు వారికి ఘన స్వాగతం పలికారు. వారు బాలబ్రహ్మేశ్వరుడికి కుటుంబ సమేతంగా ఏకవార రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన చేశారు. అనంతరం ఆలయ చైర్మన్, ఈవోలు ఆలయ అభివృద్ధిపై సీఎం కేసీఆర్‌తో మాట్లాడాలని, ఇక్కడి సమస్యల పరిష్కారం చేస్తానని గతంలో సీఎం హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. దీంతో స్పందించిన డిప్యూటీ స్పీకర్ జోగుళాంబ ఆలయ అభివృద్ధిపై సీఎంతో ఏకాంతంగా మాట్లాడుతానని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఆర్డీవో చంద్రకళ, సీఐ రాజు, ఎస్‌ఐ రమేష్, ఆలయ కమిటీ ధర్మకర్తలు చంద్రకళ, వెంకటేశ్వర్ రెడ్డి, వెంకటేష్, అంపయ్య, అడవప్ప, కేశన్న, సత్యన్న, సత్యనారాయణ, వెంకటనారాయణ, ఆనంద్ శర్మ పాల్గొన్నారు.

విశ్వశాంతి యాగమహోత్సవం



యాగమహోత్సవంలో అభిషేకం నిర్వహిస్తున్న కృష్ణజ్యోతి స్వరూపానంద

జడ్చర్ల టౌన్: పట్టణంలోని ఇంటిగ్రేటెడ్‌హాస్టల్ సమీపంలో విశ్వశాంతి యాగమహోత్సవం మంగళవారం కొనసాగింది. మహోత్సవంలో భాగంగా గోపూజ, తులసీపూజ, సహస్రలింగార్చన, రుద్రాభిషేకం, కోటి కుంకుమార్చన, విష్ణుసహస్ర, లలితాసహస్ర, సౌందర్యలహరి పారాయణం చేశారు. హనుమాన్‌చాలీసా పారాయణం, రుద్రక్రమార్చన, లక్ష బిల్వార్చనలు చేశారు. మహాగణపతి, లక్ష్మీగణపతి, చండీ, ఆదిలక్ష్మి హోమాలు నిర్వహించారు. సాయంత్రం సామూహిక లక్ష గరికార్చన నిర్వహించనున్నారు.

దుప్పల్లి చెరువులో మొసలి



దుప్పల్లి బలిజవాని చెరువులో మొసలి

మదనాపురం: మండల పరిధిలోని దుప్పల్లి బలిజవాని చెరువులో కొన్ని రోజులుగా మొసలి సంచరిస్తోంది. రాత్రి సమయంలో చెరువు కట్టపైకి వచ్చి రోడ్డుపై అడ్డంగా పండుకుంటుందని ద్విచక్ర వాహనదారులు చెబుతున్నారు. మంగళవారం మధ్యాహ్నం చెరువులో ఒడ్డుకు వచ్చి కనిపించింది. సంబంధిత అధికారులు మొసలిని బంధించి తీసుకెళ్లాలని గ్రామస్తులు కోరుతున్నారు.